# గులాబీ పార్టీలో చేరికలు

**కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి వేముల**



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 19: కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా వేల్పూర్ మండలంలోని కుకునూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు, వార్డు మెంబర్ దుర్గేన రాము, రాజ్‌పాల్, రాజేశ్, మహేందర్, అరుణ్, కళ్యాణ్, రఘు, పవన్, మారుతి, సుమంత్, భార్గవ్, అశోక్, వెంకటేశ్ ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన పద్మశాలీ సంఘం, పాలెం కుర్మ సంఘ సభ్యులు, గోన్‌గొప్పుల గ్రామానికి చెందిన ఎస్టీ తండా యువకులు, రామన్నపేటకు చెందిన యువకులు, భీమ్‌గల్ మండలం సంతోష్‌నగర్ తండాకు చెందిన గిరిజన యువకులు, మహిళలు, భీమ్‌గల్ పట్టణానికి చెందిన రజక సంఘం యువకులు గులాబీ పార్టీలో చేరారు. వారందరికీ మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**బీఆర్ఎస్‌లో కొడిచర్ల బీజేపీ, కాంగ్రెస్ నాయకుల చేరిక**

మెండోరా, నవంబర్19: మెండోరా మండలంలోని కొడిచెర్ల గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరినట్లు గ్రామ ఉపసర్పంచ్ ఇట్టెడి గంగారెడ్డి తెలిపారు.

# వేములకు మద్దతుగా కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానం



మంత్రి వేములకు ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న బాల్కొండ నియోజకవర్గ చిందు కళాకారులు

వేల్పూర్, నవంబర్ 19:వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్య, వైశ్య సంఘ సభ్యులు బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేములకు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి కాపీని వేములకు ఆదివారం అందజేశారు. బాల్కొండ నియోజకవర్గ చిందు కళాకారుల సంఘం సభ్యులు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని వేల్పూర్‌లో మంత్రికి అందజేశారు.


**మోర్తాడ్‌లో క్షత్రియ సంఘం..**

మోర్తాడ్, నవంబర్ 19: అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేములకే పూర్తిగా మద్దతునిస్తున్నట్లు మోర్తాడ్ క్షత్రియసంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ మేరకు ఎంపీపీ శివలింగుశ్రీనివాస్‌కు ఏకగ్రీవ తీర్మాన కాపీని ఆదివారం అందజేసింది.

**ఏర్గట్లలో శాలి వాహన సంఘం**

ఏర్గట్ల, నవంబర్ 19: వేముల, బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏర్గట్లలో శాలివాహన సంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఏర్గట్ల గ్రామంలో చేసిన అభివృద్ధిని చూసి వేములకు మద్దతుగా నిలవాలని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

# ఘనంగా కోతకాల పండుగ



ప్రార్థన చేస్తున్న చర్చి పాస్టర్

డిచ్‌పల్లి, నవంబర్ 19 : మండలంలోని బర్ధిపూర్ సీఎస్ఐ వెస్లీచర్చిలో ఆదివారం కోతకాల పండుగను పాస్టర్ దినకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిని పూలు, కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. రైతులు పండించిన పంటలో దశమ భాగాన్ని చెల్లించడంపై కృతజ్ఞతగా పండుగ నిర్వహించారు. నిజామాబాద్ సీఎస్ఐ సహాయ గురువు ప్రకాశ్ దైవ సందేశం అందించారు. దేవుని బిడ్డలు తమ ప్రథమ ఫలములు, సమయం, ధనంతోపాటు జ్ఞానాన్ని దేవుడి మహిమ కోసం ఉపయోగించాలని బోధించారు. ప్రార్థనల అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు



కందకుర్తి గోదావరి పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రెంజల్, నవంబర్ 19 : మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో ఆదివారం పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక పౌర్ణమి మొదటి ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు ఉదయం నుంచే గోదావరి నది వద్దకు వాహనాల్లో చేరుకున్నారు. మూడు నదులు ఒకేచోట కలిసే త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తే పాపాలు హరిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. స్నానాలు ఆచరించిన భక్తులు నది ఒడ్డున ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పుట్టమన్ను తీసుకువస్తున్న పురోహితులు

భీమ్‌గల్, నవంబర్ 19: లింబాద్రి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువజామున వేదపండితులు గర్భగుడిలోని మూలవిరాట్ విగ్రహాలకు సుప్రభాతం, షోడశోపచార పూజ, అనంతరం స్వస్తిపుణ్యాహవాచనం, అఖండ దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ధ్రువమూర్తి సన్నిధానంలో రక్షాబంధన కార్యక్రమం, నాంది సమారాధన, మంటప దేవతా ప్రతిష్ఠ నిర్వహించారు. తర్వాత అంకురార్పణ కోసం పుట్టమన్ను సేకరించే కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు నంబి పార్థసారథి, విజయ్, వాసుదేవాచార్యులు, వేణు, ప్రణీత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'వరల్డ్ కప్' ఫీవర్





జిల్లాలో ఆదివారం క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్ ఫీవర్ కనిపించింది. క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రజలు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఎక్కడికక్కడ ఎల్ఈడీ స్క్రీన్లు, టీవీలు ఏర్పాటుచేసుకొని అభిమానులు సందడి చేశారు. ఉత్కంఠగా కొనసాగిన ఆస్ట్రేలియా, టీమిండియా మ్యాచ్‌ను ఆస్వాదించారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా టీవీలకు అతుక్కుపోవడంతో రోడ్లు బోసిపోయాయి. కమ్మర్‌పల్లి గ్రామ శివారులో గొర్రెల కాపరులు గొర్రెలు మేపుతూ ఫోన్‌లో మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించడం కనిపించింది.

–ధర్పల్లి/ కమ్మర్‌పల్లి, నవంబర్ 19

## అమృతాపూర్‌లో పెద్దమ్మ పండుగ

డిచ్‌పల్లి, అక్టోబర్ 19: మండలంలోని అమృతాపూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ (వనదుర్గాదేవీ) పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో శోభాయాత్రగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## బోదేపల్లివాసి అదృశ్యం

బాల్కొండ, నవంబర్ 19 : మండలంలోని బోదేపల్లి గ్రామానికి చెందిన కోటి శ్రీనివాస్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు. కోటి శ్రీనివాస్ మెడికల్ చెకప్ కోసమంటూ ఈ నెల 18న ఉదయం 9 గంటలకు తన బైక్‌పై నిజామాబాద్ వెళ్లాడని పేర్కొన్నారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి కోట ముత్తెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.